ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- వేసవిలో తాగునీటి ఎద్దడి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

- విశాఖపట్నంలోని రుషికొండ బీచ్ కు బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ ను పునరుద్ధరించారు.

- క్షయ వ్యాధిని నివారించడానికి ఔషధాలతో పాటు పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి తెలిపారు.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈనెల 30న ప్రసారం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

వేసవిలో తాగునీటి ఎద్దడి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వేసవి ప్రణాళికపై ముఖ్యమంత్రి ఈరోజు విపత్తు నిర్వహణ, పంచాయతీ రాజ్, మున్సిపల్, వైద్యారోగ్య శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిత్యం నమోదవుతున్న ఉష్ణోగ్రతల సమాచారాన్ని ప్రజలకు ఎప్పటికప్పుడు మొబైల్ సందేశాల రూపంలో పంపించి అప్రమత్తం చేయాలన్నారు. తీవ్ర వడగాలులు వీచే అవకాశమున్న ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. పాఠశాలల్లో వాటర్ బెల్ విధానం అమలు చేయాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖ రుషికొండ బీచ్ కు బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ ను పునరుద్ధరించారు. రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖా మంత్రి మంత్రి కందుల దుర్గేశ్ ఈరోజు విశాఖ రుషికొండ బీచ్ లో బ్లూఫ్లాగ్ ను ఎగురవేశారు. అనతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... కొన్ని రోజుల క్రితం రద్దు చేసిన బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల కారణంగా డెన్మార్క్ సంస్థ మళ్ళీ ఆ హోదాను పునరుద్ధరించిందన్నారు. అంతర్జాతీయ పర్యాటకుల ఆకర్షణకు బ్లూ ఫ్లాగ్ తోడ్పడుతుందన్నారు. బీచ్ పరిశుభ్రతకు పర్యాటకులు పూర్తి స్థాయిలో సహకరించాలని మంత్రి కోరారు.

రాష్ట్రంలో బీచ్ పర్యాటకానికి ప్రోత్సాహమిస్తూ.. ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడిస్తూ....

(వాయిస్ 38 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని టీబీ వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి కోరారు. ఈ రోజు ప్రపంచ టిబి నివారణ దినోత్సవం సందర్భంగా టిబి వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వాసుపత్రులలో అందుతున్న చికిత్స, ప్రతి నెలా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వెయ్యి రూపాయల పోషణభృతి వంటి అంశాలు ప్రజలకు తెలియజేయడానికి నరసరావుపేటలో భారీ అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజారోగ్య భద్రతలో భాగంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ క్షయ వ్యాధి నిర్మూలనా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. దీనిలో భాగంగా “టిబి ముక్త్ గ్రామ్ పంచాయిత్” పేరుతో టిబి వ్యాధిగ్రస్తులకు అండగా నిలుస్తోందన్నారు. టిబి అంటువ్యాధి అయినప్పటికీ ఔషదాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పల్నాడు జిల్లాలో 1,500 మంది టిబి వ్యాధిగ్రస్తులు ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. టిబిని నివారించడానికి మందులతో పాటు పౌష్టికాహారం కూడా ఎంతో ముఖ్యమని డాక్టర్ బి.రవి పేర్కొంటూ....

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ ప్రాంగణంలో అరకు కాఫీ స్లాళ్లను ఏర్పాటు చేశారు. సభాపతి ఓం బిర్లా అనుమతితో గిరిజన కోఆపరేటివ్ సొసైటీ.. పార్లమెంట్ సభ్యులు అల్పాహారం తీసుకునే సంగం క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన రెండు స్టాళ్లను ఈరోజు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజారపు రామ్మోహనాయుడు, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో పాటు పలువురు పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) పాలకమండలి ఈకోజు తిరుమలలోని అన్నమయ్య భవనంలో సమావేశమైంది. పాలకమండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ... 5 వేల 258.68 కోట్ల రూపాయలతో 2025-26 టిటిడి వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టామన్నారు. విదేశాల్లో కూడా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయాలు నిర్మించేందుకు ప్రత్యేకమైన ట్రస్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. స్వామివారి ఆస్తులు అన్యక్రాంతం కాకుండా... స్థిరాస్తులు పరిశీలనపై కమిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలను నిర్మిస్తామన్నారు. త్వరలో ఏఐ టెక్నాలజీ ద్వారా భక్తులకు మరింత సులభతరంగా శ్రీవారి దర్శనం, వసతి తదితర సదుపాయాల కల్పన పై చర్యలు చేపడతామన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఈరోజు విజయవాడ నగరంలో వినియోగదారుల కమీషన్ రెండవ బెంచ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారుల న్యాయ స్థానాల ద్వారా వారి హక్కులను కాపాడుతున్నామని తెలిపారు. వినియోగదారుల హక్కులపై పాఠశాలలు, కళాశాలలో అవగాహన కల్పిస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పి4 సర్వేను శ్రీకాకుళం జిల్లాలో పూర్తి చేశామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈరోజు కలెక్టర్ శ్రీకాకుళంలో పాత్రికేయులతో మాట్లాడుతూ... అత్యంత వెనుకబడిన 20

శాతం కుటుంబాలకు చేయూతనిచ్చి వారిని ప్రగతి పథం వైపు నడిపించడానికి 'ప్రభుత్వ, ప్రైవేట్ ప్రజల భాగస్వామ్యం (పి4) అనే వినూత్న కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించిందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ విదర్భ నుండి ఉత్తర కేరళ వరకు విస్తరించి ఉన్న ఉత్తర-దక్షిణ ద్రోణి అంతరాయం ఈరోజు సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దిగువ ట్రోపో ఆవరణంలో దక్షిణ దిశగా గాలులు వీస్తున్నాయని వీటి ఫలితంగా రాష్ట్రంలో రెండు రోజుల వరకు వాతావరణ సమాచారాన్ని వాతావరణ అధికారి వెల్లడిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = =